ఆకు జోడు

"శండిల"

"ఆకుజోడు. చూస్తారా తల్లీ! చెమ్కి తాపి కుట్టానండి. గట్టి అట్టలు - కాగితమూ గట్రా లేవండి" అంటూ ఒక పడుచుపిల్ల పాదాలముందు పడేశాడు గడ్డెయ్య "అత్తియ్యా! పుచ్చుకోమంటారా?" అని ఆమె తన వెనకాలనే వున్న వితంతువునడిగి ఆవిడ ఆమోదానికైనా ఆగక తన సున్నితమైన చరణాల్ని చెప్పుల జంటలోకి పోనిచ్చింది

"అమ్మగారూ! దక్కగా అమిరాయండి. మంచి పనితనం ఒకటే తీయించండి" చిరునవ్వు చిలికే కళ్ళతో అన్నాడు గడ్డెయ్య కొత్తకోడలు క్రొత్త జోడులో పాదాల్ని అటూ ఇటూ జరిపి "ఎంతేంవిటే?" అనడిగింది

"రెండున్నరండి" అన్నాడు మాదిగ.

మళ్లీ ఆ పిల్ల "ఏం?" అన్నట్లు ప్రశ్నార్థకంగా అత్తమొగంలోకి చూసింది. "ఏం సురతాణి పోకడలమ్మా యివీ?" అన్నట్లుగా ఆమె మూతి ముడిచింది ఇది చూచిన గడ్డెయ్య ముఖం నిరాశతో ముడుచుకుపోయింది. "పట్టికెళ్ళబ్బి! ఇప్పుడొద్దులే" - అయిష్టతను గొంతులో స్పష్టీకరించి జోడును వదిలేసింది ఆ లేత యిల్లాలు.

ప్రొద్దుటినుంచీ యిప్పటిదాకా ఎన్ని తిరస్కారాలు తిన్నాడో గడ్డెయ్య, దిగాలుపడ్డ మనస్సుతో ఆ జత తీసుకుని బుజమ్మీద గుడ్డపాతతో తుడిచి తట్టలో బెట్టుకున్నాడు. అందులో వుంటాయి దాదాపు పదింటికి పైగా ఆకుజోళ్ల జతలు-అన్నీ ఆడవాళ్లు తొడుక్కునేవే. ఇంక ఘడియకో, అరకో ప్రొద్దు క్రుంకుతుంది గోదావరి స్టేషనుమీద. శ్రావణ మేఘాలు వున్న కాస్త వెల్తురునూ మబ్బులో దాచుకుంటున్నాయి. తుపారంకూడా మొదలయింది మెయిలుకు వెళ్లే జనంతో ప్లాటుఫారమంతా కిటకిటలాడుతోంది. అటు ఇటు ఆడువారున్న స్థలాలన్నీ అప్పటికే నాలుగైదు పార్లు తిరిగిన గడ్డెయ్య "ఏంచేస్తాను-ఈ పూటకూడా పస్తే రాశాడేమో-ఇది మూడోరోజు యింటికి పాదీ గంజిదాగడం మానేసి" అనుకొని స్టేషను వదిలిపెడుతున్నాడు. మళ్ళు మొగంపట్టిన వాడు బిక్కపోయి ఏమీ తోచనట్టు మళ్లీ స్టేషనువాకను, ఓవరుబ్రిడ్జీ మూలలను నిలుచున్న వనితలవైపు "ఏ తల్లి కనుపూ కరగలేదే" అనుకుంటూ చూస్తూ, అడ్డొచ్చిన జనాన్ని తప్పించుకొని వచ్చేస్తున్నాడు. అలా గడుగు వేసుకుంటున్న గడ్డెయ్య ఆడవాళ్ళ వెయిటింగు రూమ్ముందు ఆగాడు.

మధ్యాహ్నంనుంచీ చాలాసార్లు చూచిన గదినే మళ్ళీ చూశాడు. అక్కడ ఏమీ మార్పు అంతగా అవుపించలేదు అయితే ఒక చిన్న భేదం అతన్ని ఆకర్షించింది. అప్పటిదాకా లోపల పేము పడకకుర్చీలో వున్న నవయౌవన లావణ్యవతి ఒకామె బయటకు వచ్చి గుమ్మందగ్గర నిలబడటమే అది. తుమ్మెదరెక్కల్ని మరపించే వినీల కుంతలాలతో, తలపై తురుముబడ్డ మల్లెపూలసంతతో, గుమ్మని వాసనలు చిమ్మే సెంటు తలనూనెతో, వదనంపై పులుముబడ్డ పౌడరు తెలుపుతో, శ్రావణ సంధ్యారాగంలో మెల్లగా వీచే చల్లగాలికి రెపరెపలాడే వాయిలు చీరెలో పొంగుపరుపబడి వున్న ఆ పడుచు—విద్యార్థికురాలేమో గూడా—తన ఆకు జోడులో పాదాలిముడుస్తుందా? ఆమె ఎత్తు మడమల స్లిప్పర్లు గానీ వాడదేమో! అనే అనుమానం మళ్లీ మెదిలింది వాడి యెదలో. అయినా ప్రయత్నిద్దాం అనుకొని "అమ్మా - జోడు జూస్తారా" అని ఆమెలో ఔత్సుక్యాన్ని రేకొల్ప ప్రయత్నిస్తూ దీనంగా ప్రస్తావించాడు.

"ఏం జోడూ—ఏదీ" అని ఆమె అయిష్టం ప్రకటిస్తూనే అడిగింది.

ఏవిటో నాదుగ్గ తీరక అడిగానే గాని యీమె నిజంగా పుచ్చుకుంటుందా—అనుకుంటూనే తుప్పరకు గానీ తడిసిపోతాయేమో అనే బెంగతో తన

పైబడ్డకప్పిన తట్టలో వున్న జోళ్లు అలాగే చూపించాడు గడ్డెయ్య. ఆమె ముఖం వంచి వాటిని జాలిగా చూచింది. కరుణరసం ప్రస్ఫుటం చేస్తూనే "వద్దులే" అనేసింది. ఉదయంనుంచీ తననుతాకిన ఏ తిరస్కారం వలెనూ ఇది లేదు. వాటిలో ఒక్క దానిలోనూ ఆశ లేశమైనా లేదు. దీనిలో గడ్డెయ్యకు ఏదో వెర్రి ఆశ కనుపించింది ఆమె వాణ్ణి నఖశిఖపర్యంతమూ పరీక్షించి కళ్లల్లోకి అదోకలాగ చూసింది గడ్డెయ్య ప్రక్కకు తప్పుకున్నాడు మెయిలు ఎంత లేటో అనుకుని విసుక్కుంటున్నట్లు ప్రయాణీకులు విసుగ్గా తచ్చాడుతున్నారు. చీకటి వచ్చేస్తోంది గోదావరిమీది నుంచి రైయ్యిమంటూ గాలి చల్లదనంతో జనం పైకి దాడి వెడలింది. అందరితోబాటు, కొంచెమించుమించు హెచ్చుగానే కొవమ్ము గడ్డెయ్య వణకాడు. తలుపు వారనుంచి ఆ పడుచు ఇంకా వాణ్ణి, వాడిలో ఆశను బలీయం చేస్తూ, చూస్తూనేవుంది. ఇంతలో ఉరిమింది ఆకాశం టపటప ప్లాటుఫారమ్మీది ఆస్బెస్టాస్ రేకును చప్పుడు చేసింది జడి దూరాన దానవాయిపేట అవతలి జీడిమామిడిచెట్లతోటదగ్గర వున్న గుడిసె, అందులో మూలకి వొదిగి కూర్చున్న తనభార్య యీరీ, కొడుకు బుడ్డిగాడూ, కూతురు మాలీ వణుకుతూ మెదులుతున్నారు, కడుపు లాకలితో చేతబట్టుకుని — చినుకులు హెచ్చై వానగా మారిపోతూంటే ఎదుటివైపుకు చూసే గడ్డెయ్య స్మృతిపథంలో — మాయవాన ఆలా గంతిసేపు కురిసిందో —

ఆఖరుసారిగా అతిదీనంగా ప్రయత్నించి "అమ్మ — గొప్పోరిలా వున్నారు ఒక జత తీయించండి మూడునాళ్లనుంచీ గంజిలేక మాడుతున్నాం ఇంటెల్లిపాది మీని — మీకు పుణ్యముంటాది. రెండున్నరజోడు రెండుకే యిస్తా" — ప్రార్థించాడు. ఆమె కదిలింది. ఎదలో ఏమో మెదిలి వుండాలి యీ యమ్మకు నాపై కనికారం అనుకొని గడ్డెయ్య గంపెడాశతో గంప ఆమె ముందుంచాడు. చొరవగా ఆ పడుచు ఎదుటి ఎలక్ట్రిక్ దీపపు వెలుతురులో మహా కొనే దానిలాగా చకచక జోళ్ళ నన్నింటినీ తీసి చూసింది. దాదాపు అన్నింటిలోను కాలుంచి యిటు అటు ఆడించింది "వదులయి పోవూ?" ఎందుకో అడిగింది.

"చలనం లేని పనితనం వాడితే మీకే తెలుస్తుంది" గడ్డెయ్య మదుపు చేశాడు. ఆమె గంపంతా చిందరవందర జేసినా కావాలిసినట్టు జోడు కుదిరింది గాదు. "అబ్బే — వద్దులే" అనేసింది నిస్పాటంగా. వర్ణింపనలవి కాని నిరాశ ముసిరింది గడ్డెయ్య ముఖమ్మీద "చాలు తల్లీ - చాలు. ఆకాడికివన్నీ కలిపెయ్యాక మెంగుకండీ" అని రుసరుసలాడాడు. వాడి స్వాభిమానానికి ఆమె అదోకలాగున నవ్వుకుంది. జోళ్ళు గంపలో సర్దుకొని "అంటే కోపమొస్తుంది తమకి ఇందులో ఏజత నప్పలేదమ్మా?" అన్నాడు ఎత్తుకొంటూ —

"కాదు — నప్పాయి అన్నీ — కానైతే నచ్చొద్దూ" ఆమె మళ్లీ నవ్వింది.

"మంచిదే లెండి" అని కదులుతున్నాడు ఆమె ముఖంలోకి ఎలక్ట్రిక్ లైటు వెలుతురులో మళ్ళీచూసి. అయితే గడ్డెయ్య సాహసించి వెళ్లిపోలేక పోతున్నాడు. ఆవిడ తన్ను పరీక్షిస్తోందా అనిపించింది. మనిషిలో ఆశ అంతచెడు యింకేమీ వుండదు ఇంతలోకే మనసు తిరగేసుకున్నాడు

ఎదురుగా వంతెన క్రిందనుంచి మీదనుంచీ రొద చేసుకుంటూ సాగిపోయే కార్లు, బళ్లు, మనుషుల సొదను భేదిస్తూ, చెవులను దద్దటిల్ల చేసేలా గర్జిస్తూ కూతబెట్టుకుంటూ మద్రాసు మెయిలు వచ్చి పడబోతోంది. ప్రయాణీకుల రద్దీ యెక్కువయ్యింది. "పోర్టర్ — పోర్టర్" గట్టిగా అరచింది ఆమె కూలీజాడ అవుపడలేదు. మెయిలు వచ్చేసింది ఆట్టేసేపు ఆగదు — "ఒరే అబ్బీ! కూలీ ఎక్కడ చచ్చేడో ఏమో — ఈ పెట్టీ బెడ్డింగూ పట్టుకుని ఆడవాళ్ల పెట్టెలో ఎక్కించు" అని ఆజ్ఞాపించింది గడ్డెయ్యను. గడ్డెయ్య గంప వొకవారనవుంచి చటుక్కున పైబడ్డ చుట్టకుదురుగా వుంచి ఉంచండి అన్నాడు. ఆమె, అతని ఆసరాతోనే పెట్టెనెత్తి కెత్తింది చేత్తో బెడ్డింగు పట్టుకున్నాడు. చర చర నడుస్తోంది. ఈమె అడుగులు నా ఆకు జోడులోంచి పడితే ఎంత ఆనందంపొంగేవాడినో" అనుకుంటూ ఆమెను అనుసరించాడు.

ఆడవాళ్ల పెట్టెముందు ఆగింది ఆమె. గడ్డెయ్య లోపలికెక్కి ఖాళీగా వున్న బల్లమీద పెట్టే, బెడ్డూ వుంచాడు. ఆమె చిల్లరకోసం చేతిరొక్కం సంచితడిమి "చిల్లరలేదే" అంది. "అమ్మగారూ - కనికారంవుంచి ఒక జత బుచ్చుకోండి" అన్నాడు. ఆమె హృదయం

జాలితో కదలిపోయింది. "సరే పట్టుకురా" అనిమాత్రం అనగలిగింది. అంతులేని సంతోషంతో ఒకే ఒక్క గెంతున వెయిటింగురూం వార గంపవద్ద వాలాడు గడ్డెయ్య.

గార్డు విజిలూదాడు. ఎర్రదీపాన్ని పచ్చదీపంగా మార్చేసి వూపుతున్నాడు. చీకటిలో ఆమె వున్న పెట్టె వైపు వెర్రిగా పరుగుతీస్తున్నాడు గడ్డెయ్య. టారెన్టో ఇంజను వాడిగుండెలు బ్రద్దలయ్యేటట్టు గాండ్రించి ఒక్క లాగులాగింది మెయిలును. ఆ లగువులోనే వేగం అనింది, వేగంగా గుండెలు కొట్టుకునే గడ్డెయ్యకు. వాడు అట్టే శ్రమపడనక్కరలేకుండానే ఆమె పెట్టె ఎదురయ్యింది. మెయిలుతో గంప చేతబట్టుకొని పరుగెడుతున్నాడు. ఆమె సాహసించి ఒక జత వంగి లాక్కుంది తట్టలోంచి—రెండు కాగితాలు వాడిచేత వుంచి. తొక్కిడిలో అవి నలిగిపోయాయి. మెయిలు సాగింది. వేగంగానే సాగింది.

త్రుటిలో ఆగిపోయింది మెయిలు. ఎవరో ఎక్కవలసిన ప్రయాణికులుండి లోపలివారు గొలుసులాగి వుంటారు. ఏదో ప్రమాదం జరిగిందన్నట్లు గార్డు ఎర్రదీపం చూపించాడు. గడ్డెయ్య ఆ అవకాశం పురస్కరించుకొని ఆపదనుండి తట్టుకొన్న ప్రాణి పొందే ఆనందాన్ని చిందించే ముఖంతో ఆమె నిలుచున్న పెట్టెవద్దకు పరుగున వచ్చాడు. అపుడే ఆ పెట్టె ప్లాటుఫారం దాటింది. కొన్ని గజాల దూరంలో గోదావరి వంతెనమీదినుంచి మెయిలు యింజను చీకటిలో చిక్కగా కలిపేసి పొగను వదిలేస్తోంది, తగ్గుముఖం పట్టిన వానలోంచి ఆకాశంలోకి.

"ఏం రా మళ్లీ వచ్చావ్?" గడ్డెయ్య వైపే చూస్తున్న ఆమె అడిగింది. "దేవుడు మేలు జేశాడండి. అమ్మా - రెండు రూపాయలనుకొని మూడిచ్చారండి. ఇదిగో ఇది రెండు రూపాయల కాయితమండి. ఇది రూపాయినోటు. మరి నేను రెండు రూపాయలకే యిచ్చేస్తానన్నాను. ఈ రూపాయి పుచ్చేసుకోండి" అన్నాడు. వాడి నిజాయితీకి ఆశ్చర్యపడి ఆమె చిన్నబుచ్చుకుంది ముఖం.

"నే తెలిసే ఇచ్చాను"

"అదేంవండీ?"

"నీకు జోడు కిమ్మత్తు రెండున్నరా పుచ్చుకో సామాను తెచ్చిపెట్టినందుకు అర్థ రూపాయి మూడు రూపాయిలూ సరిపోయింది గా?"

"వద్దండమ్మా అంత మొత్తం"

"ఫా-తీసుకో" గార్డు మళ్లీ విజిలూదాడు— మెయిలు ఇంక ఆగనన్నట్లు కోపంగా కదిలింది.

"తల్లీ-మీ ఋణం మేం చర్మంతో చెప్పులు కుట్టే తీర్చుకోలేం" అంటూ చేయెత్తి నమస్కరించాడు కనులు మోడ్చి గడ్డెయ్య. మరి ఆ యువతి వాడి విన్నపం అందుకుందో లేదో.

గడ్డెయ్య కళ్లుతెరచి చూసేసరికి మెయిలు అప్పుడే చాలాదూరం వెళ్లిపోయింది వంతెనమీదికి. ఆకుపచ్చకాంతిని ప్రసరించే రెక్క స్తంభంమీది దీపంకూడా ఎర్రబడింది. వాన చల్లబడింది. గంపపై గుడ్డ గప్పుకుని గడ్డెయ్య చక చకా బజారులోకి నడిచాడు.

నోట్లు మార్చుకుని త్వరత్వరగా బియ్యమూ, మిరపకాయలూ, చుట్టలూ కొనుక్కుని సంతోష పారవశ్యంతో నిమిషాలమీద వచ్చినట్టు గుడిసె ముందు వాలాడు. జరిగినదంతా బుడ్డిగాడితోటి, యారితోనూ చెప్పి ఆ యమ్మను పొగిడాడు. గంజి గాచుకు త్రాగి మళ్లీ కుటుంబమంతా ఆ తల్లికి నమస్కరించి నిద్రపోయారు. హాయిగా. తిరిగి మూడు రోజుల దాకా చీకూ చింత లేదన్న ధైర్యం వారినెంతో తృప్తిపరిచింది.

మరునాడుదయం—బాలారుణకిరణాలు వాళ్ల గుడిసెముంగు వెలుగుపూరి విప్పాయి — దినవృత్తికి సామాను సర్దుకుంటూ "ఒరే! బుడ్డిగ! తడిశాయనుకుంటూ జోళ్లు ఆరబెట్టు" అని ఆజ్ఞాపించాడు కొడుకుని గడ్డెయ్య. బుడ్డిగాడు చింపిరవంపరైన ఆకు జోళ్లను ఒక్కొక్క జతనే తుడిచి వరుసగా వాకిలిలో ఆరబెడుతున్నాడు—ఒకటి, రెండు, మూడు...పదిదాకా లెక్కపెట్టాడు. పదకొండో జత చూస్తూ విస్తుపోయిన కొడుకు ఒక్కదూకు లోపలికి దూకి "ఒరే బాబా-చూశావా?" అన్నాడు. గడ్డెయ్య యివతలికొచ్చి చెప్పులజోళ్లు పదకొండు జతలూ జూసి "ఏం" అన్నాడు నిర్లక్ష్యంగా. "ఏం-అంటా వేట్రా?—చూడిది!" అని ఆ పదకొండో జత మళ్లీ చూపించాడు కుర్రాడు. "ఔను—దానికేం" మళ్లీ నిస్సారమే ధ్వనించింది తండ్రిస్వరంలో— "మతిగానా పోయిందేట్రా నీకు. ఇయి రెండూ ఎడంకాలి చెప్పులు గావూ?" అన్న ప్రశ్నను విని, ఆ పదకొండో జోడు తన్ను వికృతంగా చూసి వికటాట్టహాసం చేస్తున్నట్లనిపించి నిలబడ్డ పళంగా నిర్ఘాంతపోయాడు గడ్డెయ్య!!